సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: రాష్ట్రంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాయినగర్‌కాలనీకి చెందిన నాగేశ్వరరావు అనారోగ్యంతో చికిత్స అనంతరం రాజశేఖర్‌రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ.60వేలు మంజూరు కావడంతో మంగళవారం సదరు చెక్కును నాగేశ్వర్‌రావుకు అందజేశారు.

సామూహిక కుంకుమార్చన



పోచమ్మ దేవాలయంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మన్సూరాబాద్: శ్రావణమాసంను పురస్కరించుకుని మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయంలో మంగళవారం మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాల వేలం ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, పోచబోయిన గణేష్‌యాదవ్, నాంపల్లి శంకరయ్య,కృష్ణ, బొల్లు యాదయ్యయాదవ్, రాజేందర్‌గౌడ్, అమర్‌గౌడ్, ఈశ్వర్, స్వామి, సురేష్, అర్చకులు శ్రీధరచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల అందజేత



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న రామ్మోహన్‌రావు దంపతులు

దిల్‌సుఖ్‌నగర్: సింధూర్ ఎన్‌క్లేవ్ ఎమరాల్డ్ ఆవాసకాలనీకి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామ్మోహనరావు, సుమతి దంపతులు మంగళవారం అనాథ విద్యార్థి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ సమక్షంలో గృహ విద్యార్థులకు రూ. 30వేల విలువ గల కొత్త బట్టలను విరాళంగా అందచేశారు. అనంతరం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

శ్రీరామ్‌నగర్‌కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధి శ్రీరామ్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొలుసు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగార్జునరెడ్డి, కోశాధికారిగా మహేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, తన్నీరు శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను ముందుండి పరిష్కరిస్తానని, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఓ వ్యక్తిపై విద్యార్థుల దాడి

కుటుంబీకుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

నాగోలు: విద్యార్థుల మధ్య ఏర్పడిన వివాదంలో ఓ విద్యార్థికి మద్దతుగా చ్చిన ఓ వ్యక్తిపై విద్యార్థులు దాడి చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు తనపై దాడిన వారికిపై చర్యలు తీసుకోవాలని ఈనెల 2వ తేదీన కిరణ్ ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడె. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని కిరణ్‌పై దాడి చేసిన నలుగురు విద్యార్థులకు నోటీసులు అందజేశారు. వారి కుటుంబ సభ్యుల సమీక్షంలో విద్యార్థులు కౌన్సెలింగ్ ఇచ్చించారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఈ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.

గుర్తుతెలియని మహిళ మృతి



నాగోలు: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సాగర్‌రింగ్ రోడ్డు చింతల్‌కుంట రోడ్డులోని పిల్లర్ నం.24 సమీపంలో గుర్తు తెలియని మహిళ(35) పడి ఉంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆమెను పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి హోతరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెరిగిన ఓటర్లు.. పెంచాలి బూత్‌లు.!

- మలక్‌పేట నియోజకవర్గంలో పెరిగిన ఓట్లు 2300
- అదనంగా 10 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు అవసరం
- మూడు నెలల కార్యాచరణతో ముందుకెళ్తున్న అధికారులు



పోలింగ్ బూత్‌ల తీరుతెన్నులపై రాజకీయ నాయకులతో సమీక్షిస్తున్న డిప్యూటీ కమిషనర్ అలీ (ఫైల్)

చాదర్‌ఘాట్: ఒక పోలింగ్ బూత్‌లో 1200 మంది ఓటర్లుకు మించి ఉండటానికి వీలు లేదు. ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించాలి. ఒక భవనంలోని కుటుంబాల ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసే విధంగా ఉండాలి. గతంలో పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ ఈసారి మాత్రం నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఎన్నికల అధికారులు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మలక్‌పేట నియోజకవర్గ ఓటర్ల జాబితా రూపకల్పనతో పాటు పోలింగ్ బూత్‌లకు ఓటర్ల విభజన తదితర చర్యలపై ఇక్కడి అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఈసారి అదనపు బూత్‌లు అనివార్యం..

మలక్‌పేట నియోజకవర్గములో గతంలో జరిగిన రెండు జీహెచ్‌ఎంసీ, రెండు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 300 పోలింగ్ స్టేషన్లు నిర్దిష్టంగా ఉండేవి. ఏడాది కోమారు ఓటర్ల సంఖ్య పెరిగినా అదే బూత్‌లో అటు ఇటు సరిపెట్టే వాళ్లు. తాజాగా ఓటర్ల సంఖ్య పెరగటంతో పాటు ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లకు మించి ఉండరాదన్న నిబంధన అమలులోకి రావడంతో పరిస్థితి మారింది. ఫలితంగా అదనపు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం అనివార్యం అయ్యింది.

గతేడాదిలో నియోజకవర్గ ఓటర్ల సంఖ్య		జనవరి నుంచి 2025 ఆగస్టు 10 వరకు	
- పురుష ఓటర్లు:	1,60,693	- పురుష ఓటర్లు:	1,61,407
- మహిళా ఓటర్లు:	1,58,201	- మహిళా ఓటర్లు:	1,59,174
- ఇతరులు:	11	- ఇతరులు:	6
మొత్తము ఓటర్లు:	3,18,905	మొత్తము ఓటర్లు:	3,20,587

ఈ ఏడాది మలక్‌పేట నియోజకవర్గంలో పెరిగిన ఓట్లు దాదాపు 2300

10కొత్త పోలింగ్ బూత్‌లు..

నియోజకవర్గములో మొత్తం 300 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. అందులో 150 పోలింగ్ బూత్‌లలో 1200 మించి ఓటర్లు ఉన్నారు. పలు సవరణల అనంతరం నియోజకవర్గంలోని ఏడు డివిజన్‌లలో 10కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇప్పటి వరకు 85భవనాలలో 300 పోలింగ్ బూత్‌లు ఉండేవి. ఇప్పుడు అదనపు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు కోసం మరో భవనాలు కావాల్సి ఉంది.

మూడు నెలల్లో కసరత్తు పూర్తి..

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్‌ను సమర్థవంతంగా పూర్తి చేయడం కోసం అవసరమైన వసతులు, అనువైన వాతావరణం ఉన్న భవనాలను మాత్రమే ఎంపిక చేసుకొని అందులో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ తతంగాన్ని మూడు నెలల వ్యవధిలోపు పూర్తి చేయాల్సి ఉంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు



వచ్చే ఎన్నికల నాటి నుంచి ఓటర్లుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాము. ఇంటి నుంచి పోలింగ్ బూత్‌కు వెళ్లడం మొదలు అన్ని విధాల సమాచారాన్ని ఇంటి నంబర్ల ప్రాతిపదికన ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నాం.

– మలక్‌పేట సర్కిల్–6 డీసీ అలీ

కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి



కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న నిర్వాహకులు

నాగోలు: భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్న వారంతా లేబర్ ఇన్సూరెన్స్ కార్డు పొందాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోకమల్లు చైతన్య కోరారు. మంగళవారం స్నేహపురికాలనీ రోడ్ నం.11లో కార్మికుల యూనియన్ లేబర్‌కార్డుల రెన్యువల్, నూతన కార్డుల దరఖాస్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మికులు తప్పకుండా దరఖాస్తు, రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. ప్రమాదం బీమా కింద రూ.6లక్షలు, సాధారణ మృతికి రూ.3లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని తెలిపారు. పెళ్లి, ప్రసూతి కానుక కింద రూ.30వేలతో ఇతర పథకాలకు అర్హులవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, న్యూ నాగోలు అధ్యక్షులు చంద్రయ్య, కార్యదర్శులు ఎండీ లతీఫ్, అధ్యక్షులు శంకర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల మరమ్మతులకు నిధులు కేటాయించాలి



జలమండలి అధికారికి వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ఇటీవల కురిసిన వర్షాలతో కుంగిపోయి దెబ్బతిన్న డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని జలమండలి అధికారి వీఎల్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రధాన కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మన్సూరాబాద్‌లో మాట్లాడుతూ.. సుమారు 30కాలనీల డ్రైనేజీ పైపులైన్ లింక్‌ను వీరభద్రనగర్‌కాలనీకి మళ్లించడంతో కాలనీలోని రోడ్లు చెరువులను తలపించాయని తెలిపారు. దీంతో డ్రైనేజీ పైపులైన్లు దెబ్బతిన్నాయని ఆయన దృష్టికి తీసుకవచ్చినట్లు వివరించారు. మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ అధికారులు అందించిన పైపులు నాణ్యతలేవని అన్నారు. సమస్య మళ్లీ తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం నాగేంద్ర, జీఎం మహేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



యశస్వినిని సన్మానిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

యశస్విని స్ఫూర్తిగా తీసుకోవాలి

నాగోలు: విద్యార్థులు ఉన్నంత చదువులు చదివి నవ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. మారుతీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన యశస్వినిని మంగళవారం కార్పొరేటర్ సన్మానం చేశారు. కార్పొరేటర్ పవన్ కుమార్ మాట్లాడుతూ... యశస్విని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కొత్తపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు యశస్విని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

18న మున్నూరుకాపుల జన చైతన్య పాదయాత్ర

కాచిగూడ: మున్నూరుకాపులు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ డిమాండ్ చేశారు. మున్నూరుకాపుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టి మున్నూరుకాపుల్లో చైతన్యం తీసుకురాడానికి 20 రోజుల పాటు మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం కాచిగూడలో మీడియాతో మాట్లాడుతూ...ఈనెల 18వ తేదీన మహబూబ్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద పాదయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. సెప్టెంబర్ 6వ తేదీన వరంగల్ జిల్లాలో పాదయాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు. మున్నూరుకాపులందరూ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తుల రాములు, కటికం మహేష్, అమరం శ్యామ్, పత్తి అనిల్, రాయని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 37, వంకాయ 23, బెండ 45, పచ్చి మిర్చి 45, కాకర 23, బీర 28, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 45, దొండ 23, చిక్కుడు 55, గోకర 28, బీట్‌రూట్ 28, క్యాప్సికం 40, ఆలుగడ్డ 23, దోస 15, సొరకాయ 11, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 23లుగా ఉన్నాయి. గమనిక: ఈ ధరలు బుధవారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వివాహ వేడుకకు రాహుల్‌గాంధీకి ఆహ్వానం



రాహుల్‌గాంధీకి ఆహ్వానపత్రికను అందజేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, జక్కిడి శివచరణ్‌రెడ్డి

మన్సూరాబాద్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి – డాక్టర్ దివ్యారెడ్డిల వివాహ మహోత్సవ వేడుకలు ఈనెల 17న శంషాబాద్‌లోని జీఎంఆర్ అరేనా కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ వివాహ వేడుకలకు హాజరుకావాలని లోకసభ ప్రతిపక్షనేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీని మంగళవారం కలిసి ఆహ్వానపత్రికను టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అందజేశారు.

ముగిసిన దర్గా ఉర్సు ఉత్సవాలు



దర్గా ఉర్సు ఉత్సవాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి చింతలకుంట సరస్వతినగర్‌కాలనీ కమాన్ వద్ద ఉన్న హజ్రత్ సయ్యద్ అబ్దుల్ షాహిద్ దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిసాయి. మూడు రోజుల పాటు దర్గా ఉర్సు ఉత్సవాలు వైభంగా జరిగాయని నిర్వాహకులు తెలిపారు. సమీప కాలనీల నుంచి హిందూ, ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారని పేర్కొన్నారు. ఉర్సు చివరిరోజు నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా ముత్తవలి సయ్యద్ పాషా, సయ్యద్ అన్వర్‌పాషా, సయ్యద్ హాజీ, సయ్యద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు కేంద్రం మొండిచేయి



కార్యవర్గం సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఎల్‌బీనగర్: రాష్ట్రం పట్ల కేంద్రం చిన్న చూపుచూస్తోందని.. తెలంగాణకు నిధులు మంజూరు చేయకుండా మొండిచేయి చూపిస్తోందని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి పగడాల యాదయ్య ఆరోపించారు. సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యవర్గం సమావేశం మంగళవారం నాయకుల కొత్త గణేష్‌గౌడ్ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న తెలంగాణకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని అన్నారు. బీసీ బిల్లు ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెడుతుందని విమర్శించారు. బీజేపీ మాటలలో చేతలల్లో విషము చిమ్ముతున్నారని దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కేంద్రం ప్రభుత్వం వెంటనే 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, నాయకులు చంద్రమోహన్, కృష్ణయ్య, కనకయ్య, మల్లేశం, భాస్కర్, కృష్ణరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిటీషర్లతో పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్

హస్తినాపురం: భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని రాష్ట్ర మాజీ నాయకులు మెగావత్ సీతారాం నాయక్ అన్నారు. మంగళవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హస్తినాపురం డివిజన్‌లో సిగ్నల్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. బాద రాజు భవాని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతారాంనాయక్ హాజరై మాట్లాడారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, ఆజాద్ వంటి ఎందరో వీరుల ఆశయ సాధనకు బాబ్రుద్దీన్, ప్రేమ్‌నారాయణ్‌భార్గవ్‌ల నాయకత్వంలో 1936 ఆగస్టు 12న ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ సంఘం నాయకులు సంతోష్, రేణుక, ఉష, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాకుండానే బంద్.!



బీడీరెడ్డి గార్డెన్ సమీపంలో తెలంగాణ చౌరస్తాలో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ టాయిలెట్లు

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బీడీ రెడ్డి గార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభం కాకుండానే మూతబడిపోయాయి. తెలంగాణ చౌరస్తాలో రెండేళ్ల క్రితం కంటైనర్‌తో కూడిన టాయిలెట్లను ఏర్పాటు చేశారు. అయితే సరైన నీటి సౌకర్యం లేకనో.. నిర్వహణ లేకనో అవి ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. కాగా టాయిలెట్లు చౌరస్తా సమీపంలో ఉండటంతో అక్కడ రోడ్డు ఇరుకుగా మారి తరచుగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న నిరుపయోగ టాయిలెట్లను అక్కడి నుంచి తీసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వానిది పిరికిపంద చర్య



సుభాష్‌చందర్జీని హౌజ్‌అరెస్ట్ చేసిన సైదాబాద్ పోలీసులు

సైదాబాద్: పవిత్ర శ్రావణ మాసంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు చేయటానికి కూడా వెళ్లకుండా తమను అక్రమంగా అరెస్ట్ చేయటం సరికాదని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ సీనియర్ నేత సుభాష్‌చందర్జీ అన్నారు. ఇలాంగి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి భవిష్యత్‌లో రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మంగళవారం సైదాబాద్‌లోని నివాసంలో ఆయనను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. ఆయన బయటకు ఎక్కడికి వెళ్లకుండా కట్టడి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూబ్లిహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో సామూహిక కుంకుమార్చనకు పలు హిందూ సంఘాలు పిలుపును ఇచ్చాయని తాము అక్కడికి వెళ్లకుండా ప్రభుత్వం పోలీసులతో అడ్డుకోవడం అప్రజాస్వామికమని అన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయించండి

కాచిగూడ: అంబర్‌పేట నియోజవకర్గంలో పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. కొత్త పనులకు శ్రీకారం చుట్టాలని కోరారు. ఇప్పటి వరకు జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



గుంతలమయంగా మారిన శ్రీరాంకాలనీ-వాంబేకాలనీ రోడ్డు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో మడుగులను తలపిసున్నాయి. ఇటు మహేశ్వరం, అటు రాజేంద్రనగర్ నియోజకవర్గాల సరిహద్దులో ఉండడంతో మొదటి నుంచి ఈ రహదారిపై నిర్లక్ష్యం కొనసాగుతూనే వస్తోంది. శ్రీరాం కాలనీలోని పారిశ్రామిక వాడకు లోడ్‌తో వెళ్లే భారీ లారీలతో ఈ రోడ్డు మరింత గోతులుగా మారుతోంది. ముఖ్యంగా శ్రీరామ కాలనీ నుంచి మోడీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్స్ వరకు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా కాలనీల ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

హర్ ఘర్ తిరంగా..



అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసిన కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి



మాదన్నపేట ర్యాలీలో పాల్గొన్న సహదేవ్‌యాదవ్

సైదాబాద్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా మంగళవారం డివిజన్ పరిధిలోని డీఎస్‌నగర్ కాలనీలోని అంబేద్కర్ విగ్రహాన్ని కార్పొరేటర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుద్ధి చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాలతో అందరిలో దేశభక్తి పెరిగి జాతీయ ఐక్యత పెంపొందుతుందదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, సీనియర్ బీజేపీ నాయకులు రేణుక ముదిరాజ్, సుష్మ, జమున, మధుమతి పాల్గొన్నారు.

కుర్మగూడ డివిజన్‌లో...

చంచల్‌గూడ: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారత్ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మంగళవారం బీజేపీ పార్టీ, వివిధ పాఠశాలల విద్యార్థులు కుర్మగూడ డివిజన్‌లో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రను పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ కె. సహదేవ్‌యాదవ్ ప్రారంభించారు. జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ డివిజన్‌లో ర్యాలీగా వెళ్లారు. ఈ యాత్రలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, యాఖుత్‌పురా కన్వీనర్ బండ వెంకట్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు డి. యుగేంధర్‌నాథ్, నాయకులు దశరథ లక్ష్మీ, నాగరాజు, లలిత, వరుణ్, లడ్డు, గౌతమ్‌తో పాటు మాదన్నపేట పోలీసులు పాల్గొన్నారు.